సామాజిక, రాజకీయ, సినీ వారపత్రిక
చరిత్ర
నిన్న జరిగింది నేటి 'చరిత్ర' - నేడు జరిగేది రేపటి 'చరిత్ర'

# మన మాట

ప్రతి పదం ప్రజల పక్షం

TELANAGANA సంపుటి 7 సంచిక 21

S tv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

బుధవారం | 6 నవంబర్ | 2024 | పేజీలు : 2


HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA




# లక్షన్నర కోట్లతో ప్రక్షాళన చేసిన మూసీలో కలుషిత జలాలే ప్రవహిస్తాయా?

## కాలుష్య నియంత్రణ మండలిని ప్రక్షాళన చేయకుండా ఏం చేసినా వృధాయేనా?

మూసీ నదిని గంగా నదిలా మంచి నీటితో ఉరకలెత్తే జీవనదిగా మార్చేస్తామంటున్నారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అందుకోసం భారీ ప్రక్షాళన కార్యక్రమానికి నడుం బిగిస్తున్నామంటున్నారు. ఏకంగా లక్షన్నర కోట్ల రూపాయల నిధులు ఉదారంగా ఖర్చు చేసేస్తామంటున్నారు.ఇదంతా అనుకున్నది అనుకున్నట్లుగా ..పాలకులు చెప్పింది చెప్పినట్లుగా జరిగితే అంతకన్నా గొప్ప కార్యక్రమం మరోటి ఉండదనడంలో ఎవరికీ అనుమానాలు అవసరం లేదు. కాకపోతే అది కార్యాచరణలో ఎంత వరకు సాధ్యం? అన్నదే అసలు ప్రశ్న.కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన ఈ ఆలోచన వల్ల ఒరిగేదేంటన్నది కనీసం రేవంత్ రెడ్డికైనా తెలుసా? అని మేథావుల నుంచి కోటి ప్రశ్నలు వస్తున్నాయి.నిజమే ఒకప్పుడు మూసీ నది ఎలా ఉండేది? వికారాబాద్ లో పుట్టి గల గల పారుతూ ఒకప్పటి గంగా నదిలానే ఎంతో హాయిగా ఉరకలు వేసేది మూసీ నది. మరి అటువంటి మూసీనది ఆ తర్వాత ఏమైంది? అతి పెద్ద మురుగు నీటి నదిగా మారింది. అది మారలేదు. దశాబ్దాల తరబడి పాలించిన ప్రభుత్వాలే దానికాగతి పట్టిచాయి. చాదర్ ఘాట్, ఉప్పల్ వద్ద మూసీ పరీవాహక ప్రాంతం వెంబడి అటూ ఇటూ నివసించే లక్షలాది మంది తమ ఇళ్లల్లో వినియోగించిన వ్యర్థ జలాలను మూసీలోకి విడుదల చేయడం మొదలు పెట్టారు. వాటికి ప్రభుత్వాలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చి మూసీని భ్రష్టు పట్టించాయి. ఇది చాలదన్నట్లు హుస్సేన్ సాగర్ నుంచి వచ్చే విష రసాయినాలతో కూడిన వ్యర్ధాలూ మూసీలోనే కలుస్తున్నాయి. ఒకప్పుడు మంచినీటి సరస్సు అయిన హుస్సేన్ సాగర్ ను నాశనం చేసింది కూడా ఘనత వహించిన ప్రభుత్వాలే.



జీడిమెట్ల,పటాన్





చెరు ,కాటేదాన్ వంటి పారిశ్రామిక వాడల్లో పరిశ్రమలు నిర్లక్ష్యంగా విడుదల చేసే విష రసాయిన వ్యర్థాలను నేరుగా హుస్సేన్ సాగర్ లో కలపడం అన్నది ప్రభుత్వాల ఆజమాయిషీలోనే మొదలైంది. అది దశాబ్దాలుగా కొనసాగుతోంది. తాము చేసిన పాపం చాలదన్నట్లు హుస్సేన్ సాగర్ ప్రక్షాళనకు గత ప్రభుత్వాలు 1200 కోట్ల రూపాయలు బడ్జెట్ విడుదల చేసి శుద్ధి ఆపరేషన్ మొదలు పెట్టారు. అయితే ఒక పక్క శుద్ధి పనులు చేస్తూనే మరో పక్క పారిశ్రామిక వ్యర్థాలు సాగర్ లో కలుపుతూ పోయారు. ఈ తుగ్లక్ వ్యవహారాన్ని నిలదీస్తూ న్యాయస్థానంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది కూడా. ఆ 1200 కోట్ల రూపాయలను ఏ ప్రభుత్వం అయితే ఖర్చు చేసిందో వారి నుంచే వసూలు చేయాలని అందులో డిమాండ్ చేశారు.ఇదంతా ఎందుకంటే.. ఇపుడు మూసీ నదిని ప్రక్షాళన చేస్తామంటున్నారు కదా అందుకే. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని పాలకులకు చెప్పడమే దీని ఉద్దేశం.

## లక్షా యాభైవేల కోట్లు బూడిదలో పోసిన పన్నీరవుతాయా?


### అధికారంలో ఉన్న వారి జేబులు నింపే అవినీతి ఖజానాగా మారుతుందా?

మంచి ఆలోచనలు ఉండడం మంచిదే. దాన్ని ఎవరూ తప్పు బట్టరు.కాకపోతే ప్రజాధనాన్ని వెచ్చించేటపుడు ప్రతీ పైసాకీ భద్రత ఉండేలా చూసుకోవాలి. దానికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. ఎందుకంటే ప్రభుత్వం ధర్మకర్తలా వ్యవహరించాలి. అందుకే మూసీ ప్రక్షాళన వల్ల ఎంత మేలు జరుగుతుందో..దానిపై చేసే ఖర్చులో ఒక్క పైసా కూడా వృధాగా పోకుండా చూసుకోవలసిన బాధ్యత కచ్చితంగా పాలకులదే. అక్కడ నిర్లక్ష్యం వహిస్తే మొదటికే మోసం వస్తుంది. అది అధికారంలో ఉన్నవారి అవినీతికి ఖజానా కాకూడదు.మూసీ నది ప్రక్షాళనకు లక్ష కోట్లో లక్షన్నర కోట్లో ఖర్చు చేస్తామంటున్నారు. మంచిదే.మూసీ నది నిజంగానే బాగుపడుతుందంటే ఎంత ఖర్చు చేసినా తప్పులేదు. ఇటువంటి ఆలోచన వచ్చినందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని మెచ్చుకోవాలి కూడా. అయితే ఇక్కడే లక్షన్నర కోట్ల ప్రజాధనం వృధాగా పోకుండా జాగ్రత్తలు పడాలని చెప్పేది. ప్రతిపక్షాలు మూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్నాయి. మూసీ ప్రక్షాళనలో భాగంగా మూసీని ఆక్రమించి నివాసాలు ఏర్పాటు




చేసుకున్న వారిని..అక్రమ కట్టడాలు నిర్మించిన బడా బాబులనూ కూడా అక్కడి నుండి తప్పించాల్సి ఉంటుంది. పేదలను ఆగమేఘాల మీద తరలించేస్తున్నారు. వారికి వేరే చోట డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామంటున్నారు. మంచిదే. ఆక్రమణల్నీ తొలగించేసి..మూసీ జలాలను శుద్ధి చేసేసి స్వచ్ఛమైన జీవనదికి ప్రాణం పోస్తామంటే ఎవరొద్దంటారు? మహారాజులా చేయండి. కానీ మూసీ ప్రక్షాళన చేయడానికి ముందు ఘనత వహించిన కాలుష్య నియంత్రణ మండలిని ప్రక్షాళన చేయండంటున్నారు సామాజిక వేత్తలు. దీనిపై కొందరు దశాబ్ధాల తరబడి పోరాటాలు కూడా చేస్తున్నారు. ఎందుకంటే లక్షన్నర కోట్లతో మూసీని శుద్ధి చేసిన తర్వాత కూడా అందులో విష రసాయిన వ్యర్థాలు..మురుగు నీరు వచ్చి చేరుతూనే ఉంటుంది. అదే జరిగితే లక్షన్నర కోట్లు ఏమైనట్లు? మురికి గుంటలో పోసిన పన్నీరైనట్లు కాదా? అని వారు ప్రశ్నిస్తున్నారు.





# కంచె చేనును మేస్తోంది

# కరెన్సీ కట్టలు భోం చేసి మురుస్తోంది

## పీసీబీ దొంగల వైఖరితో పర్యావరణం కంటతడి పెడుతోంది

పీసీబీలో ఏం జరుగుతోంది? అసలు పీసీబీ చేయాల్సిన పని ఏమిటి.? కాలుష్యాన్ని నియంత్రించడం కోసమే పీసీబీని పెట్టారు.కానీ తెలంగాణాలో పీసీబీ ఏం చేస్తోంది? కాలుష్యకారక పరిశ్రమలపై ఈగ కూడా వాలకుండా కాపాడుకొస్తోంది. ప్రమాదకరమైన విష రసాయిన వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా జనావాసాలపైకి భూగర్భంలోకి చెరువులు కుంటల్లోకి చివరకు మూసీలోకి నదుల్లోకి విడుదల చేస్తోన్న కాలుష్య కారకులపై చర్యలు తీసుకోవలసిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు దొంగలకే అండగా ఉంటున్నారు. ఫలానా చోట ఫలానా పరిశ్రమ విష రసాయినాలను, వ్యర్థాలను విడుదల చేస్తోందని ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. పీసీబీలో ఉన్నతాధికారులు ఆ కాలుష్య పరిశ్రమకు ఫోన్ చేసి మీపై ఫిర్యాదులు వచ్చాయి..మరి ఏం ఇచ్చుకుంటారో చెప్పండంటూ బేరాలాడుకుంటున్నారని సామాజిక వేత్తలు ఆరోపిస్తున్నారు. కాలుష్య కారక పరిశ్రమలపై కోర్టుల్లో పిటిషన్లు దాఖలైతే.. కాలుష్యాలపై నివేదిక ఇవ్వండని న్యాయస్థానాలు ఆదేశించినాపీసీబీ అధికారులు నెలల తరబడి మన్ను తిన్న పాములా నిద్రపోతున్నారే తప్ప నివేదికలు ఇవ్వడం లేదు. నివేదిక ఇచ్చి తీరాల్సిన అగత్యం వస్తే పరిశ్రమలకు క్లీన్ చిట్ ఇస్తున్నారు. అదే పరిశ్రమ నుండి విడుదలైన వ్యర్థాలను వేరే చోట పరీక్షిస్తే అవి అత్యంత ప్రమాదకరమైన వ్యర్దాలని తేలుతోంది. దీనర్థం ఏంటి? పీసీబీ అధికారులకు ఆకలి ఎక్కువ. వారు కరెన్సీ కట్టలు మాత్రమే భోంచేస్తారు. తమ ఆకలి తీర్చిన పరిశ్రమల జోలికి ఎవరూ రాకుండా తామే కాపలా కాస్తారు. ఎన్ని దొంగ సర్టిఫికెట్లు అయినా ఉదారంగా ఇచ్చేస్తారు.తెలంగాణా కాలుష్య నియంత్రణ మండలి లో ఉన్నతాధికారుల ధన దాహం ప్రజల ప్రాణాలతోనే చెలగాటం ఆడుతోంది.ఒక్క జీడిమెట్ల పారిశ్రామిక వాడలోనే 72 పరిశ్రమలకు పైగా ఉంటే అందులో 32 పరిశ్రమలు అత్యంత ప్రమాదకరమైన భయంకరమైన కాలుష్యాలను వెదజల్లుతున్నాయి. అవి ప్రజల ప్రాణాలతోనే కాదు పాడి పశువులు ఇతరత్రా మూగజీవాలనూ చంపేస్తున్నాయి. భూగర్భ జలాలను కాలకూట విషంగా మార్చేస్తున్నాయి. నిజానికి ఈ పరిశ్రమల నుండి విడుదల అయ్యే వ్యర్ధలను





ఎఫ్లూయెంట్ ప్లాంట్ లో శుద్ధి చేసిన తర్వాతనే విడుదల చేయాలి. దీనికోసమే జీడిమెట్లలో ఒక ప్లాంట్ కూడా పెట్టారు. కాకపోతే అది నామ్ కే వాస్తేగానే పనిచేస్తుంది. ఈ ప్లాంట్ నిర్వహణ కూడా కొందరికి డబ్బులు సంపాదించి పెట్టే పరిశ్రమగా పనిచేస్తోంది. పూర్తి స్థాయిలో శుద్ధి చేయకుండానే ఏదో ఒకటి చేసేసి మమ అనిపించేస్తున్నారు. ఛార్జీలు మాత్రం యథాతథంగా వసూలు చేసి జేబులు నింపుకుంటున్నారు. దీని వల్ల వారి ఆదాయాలు పెరుగుతున్నాయి తప్ప కాలుష్యం తగ్గడం లేదు. ఆదాయంతో పాటే కాలుష్యమూ పెరుగుతోంది. నిజానికి ఇటువంటి ప్లాంట్ లు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండాలంటారు మేథావులు. గుజరాత్ లో ప్రభుత్వమే పరిశ్రమల నుండి విడుదల అయ్యే కాలుష్యాలను వ్యర్థాలను శుద్ధి చేస్తుంది. తెలంగాణాలో అటువంటి సదుపాయం లేకపోవడంతో పాటు పీసీబీ అధికారుల అవినీతికి భయపడే పరిశ్రమలు తరలి పోతున్నాయి. గత మూడేళ్లలోనే 27 పరిశ్రమలు గుజరాత్ కు తరలి పోయాయి.

### కాలకూట విషరసాయినాలు వెదజల్లే వారిని
### అల్లారు ముద్దుగా సాకుతున్నారు
### కాలుష్య ప్రోత్సాహక మండలిని రద్దు చేస్తామన్న న్యాయస్థానం

కాలుష్య నియంత్రణ మండలి నిర్వాకాల గురించి పాలకులు తమకేమీ తెలీనట్లు నాటకాలాడచ్చు. కానీ రాష్ట్రంలో సర్వోన్నతమైన హైకోర్టు ధర్మాసనం గతంలోనే పిసిపి పెద్దలకు




పెద్ద వార్నింగే ఇచ్చింది. కాలుష్యాన్ని వెదజల్లే కార్పొరేట్ పరిశ్రమలను కాపాడే పీసీబీ ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే అన్న న్యాయస్థానం దాన్ని రద్దు చేయాల్సి వస్తుందని హెచ్చరించింది కూడా.ఆరె గూడెం వద్ద సర్పంచ్ కలుషిత జలాలపై ఫిర్యాదు చేస్తే పీసీబీ వారు నమూనా పట్టుకెళ్లారు. అగ్రికల్చర్ డిపార్ట్ మెంట్ వారు ఒక నమూనా పట్టుకెళ్లారు . . రైతులు ప్రైవేట్ ల్యాబ్ లో పరీక్షించారు. చిత్రం ఏంటంటే ప్రభుత్వ వ్యవసాయ శాఖ చేసిన పరీక్షల్లోనూ రైతులు ప్రైవేటు ల్యాబ్ లో చేయించిన పరీక్షల్లోనూ ఆ కలుషిత



జలాలు వ్యవసాయానికి ఏ మాత్రం పనికిరావని తేలింది. కానీ పీసీబీ వారు మాత్రం ఆ జలాల్లో ఎలాంటి ఇబ్బందికర రసాయినాలూ లేవంటూ కాలుష్యకారక పరిశ్రమకు క్లీన్ చిట్ ఇచ్చారు. జీడిమెట్ల లో ఎఫ్లూయెంట్ ప్లాంట్ పై ఫిర్యాదులు వస్తే హై కోర్టు నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశిస్తే ఏడాది దాటినా పిసిబి నివేదిక ఇవ్వలేదు. ఈ క్రమంలోనే హైకోర్టు అసలు పీసీబీ అవసరమా? అని ప్రశ్నించడమే కాదు దాన్ని రద్దు చేయడమే బెటరేమో అని వ్యాఖ్యానించింది కూడా. అందుకే ముందుగా కాలుష్య నియంత్రణ మండలిని ప్రక్షాళన చేయాలి. లేదంటే చిత్తశుద్ధి లేని మండలిని రద్దయినా చేయాలి. ఆ తర్వాతనే మూసీ ప్రక్షాళనకు నడుం బిగించాలి. అంత వరకు ప్రజాధనాన్ని మూసీ ప్రక్షాళన పేరిట వృధా చేయకూడదంటున్నారు మేథావులు.

**అనిల్ కుమార్ కుంట....**



